# మొక్కుబడిగా..

అంతంతమాత్రంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ

వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక వెలుగు వెలిగిన సర్కారీ బడులను పట్టించుకోని నేటి ప్రభుత్వం

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ చదువుల ప్రాంగణాలు


వరండాలోనే చదువులు


లక్ష్మీవానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణం


మరమ్మతులకు గురయిన మంచినీటి బోరు


ఆర్‌హెచ్ కాలనీలో ఆగిపోయిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం

పీఎం పాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సువర్ణాధ్యాయంగా నిలిచింది. సర్కారీ బడులు రాజప్రాసాదాల్లా వెలుగొందాయి. కానీ నేడు వాటి నిర్వహణ దయనీయంగా మారిందని పలువురు వాపోతున్నారు. అంత వరకూ నేల బడులుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు నాడు నేడు పుణ్యమా అని మహర్దశ సంతరించుకున్నాయి. దీంతో నేలబడులు కాస్త డెస్క్‌.. బెంచీ స్థాయికి చేరుకున్నాయి. ఈ ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మురిసిపోయారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాలలపై శ్రద్ధ తగ్గినట్లు పలువురు వాపోతున్నారు.

**సమస్యల సుడిలో పీఎంపాలెం పాఠశాలలు..**

ఈనెల 12న 2025–26 విద్యా సంవత్సరానికిగాను పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో పీఎం పాలెంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించగా పలు సమస్యలు తొంగి చూస్తున్నాయి. స్థానిక లక్ష్మీవానిపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 1 నుంచి 8వ తరగతి వరకూ 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో తీవ్ర వసతి సమస్య నెల కొంది. 8 తరగతులకుగాను ఆరు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవీ చాలీచాలని ఇరుకు గదులు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు అదనపు గదుల నిర్మాణానికి రూ. 48 లక్షలు మంజూరు చేయగా నిర్మాణ పనులు చేపట్టారు. నాడు నేడు పథకం కింద మరో రూ. 26 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వాటి గురించి కనీసం పట్టించుకోకపోవడంతో సగంలోనే వాటి నిర్మాణం ఆగిపోయింది. వరండాలో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో సుమారు 80 వరకూ డెస్క్ బెంచీలు ఉండగా సుమారు 20 బెంచీలు మరమ్మతులకు గురయ్యాయని పాఠశాల వర్గాలు చెబుతున్నాయి. పాఠశాల ప్రాంగణంలో ఉన్న మంచినీటి బోరు మరమ్మతులకు గురై చాలా కాలం అయింది. తర్వాత దానిని పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుతం 1 నుండి 5వ తరగతి వరకూ ఏడుగురు, 6,7,8 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. తెలుగు, హిందీ భాషా పండితుల పోస్టులు ఎన్నో ఏళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. పాఠశాలకు కనీసం ఆట స్థలం కూడా లేదు. ప్రభుత్వం స్పందించి నిర్మాణంలో ఉన్న అదనపు గదుల నిర్మాణం పూర్తి చేసి వసతి సమస్య పరిష్కరించాల్సిందిగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## అధ్వానంగా ఆర్‌హెచ్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల..

ఆర్‌హెచ్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకూ 129 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ కూడా వసతి సమస్య ఉంది. అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. చాలీ చాలని తరగతి గదుల వల్ల వరండాల్లో నెట్టుకు వస్తున్నారు. వర్షం పడితే పాఠశాల వాతావరణం ఇబ్బందికరంగా ఉంటుందని ఈ పరిసరాలను చూస్తేనే అర్థమవుతుంది. పాఠశాలకు తాగునీటి అవసరాలకు ఏర్పాటు చేసిన బోరింగ్ చాలా కాలం నుంచి పని చేయడం లేదు. కుళాయి నీటిపై ఆధార పడుతున్నారు. పాఠశాలలో ఏనాటి నుంచో నిల్వ చేసిన సిమెంట్ బస్తాలు అలాగే ఉన్నాయి. వాటిపై డెస్క్ బెంచీలు చిందర వందరగా పడి ఉన్నాయి. పాఠశాలలో గాలి, వెలుతురు సమస్య కూడా ఉంది. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆర్‌హెచ్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిల్వ చేసిన సిమెంట్ బస్తాలు.. చిందర వందరగా బెంచీలు

## బాబయ్యమ్మకు ఘన నివాళి


బాబయ్యమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు

మధురవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగోతి తాతారావు, అప్పారావుల మాతృమూర్తి నాగోతి బాబయ్యమ్మకి వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రంపాలెం గ్రామంలో పెద్ద కర్మ సందర్భంగా వారి నివాసం వద్ద ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

## భూమిలో కూరుకుపోయిన బోరు బావి


దుక్కవానిపాలెంలో భూమిలో కూరుకుపోయిన బోరుబావి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ దుక్కవానిపాలెంలో బోరుబావి భూమిలో కూరుకు పోయింది. దీంతో ఈ ప్రాంత వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిని పునరుద్ధరించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే బోరుబావి చుట్టూ ప్లాట్‌ఫారం నిర్మించాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### కూర్మావతారంలో జగన్నాథుడు


కూర్మావతారంలో దర్శమిస్తున్న జగన్నాథుడు

కొమ్మాది: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి వారి రథోత్సవాల్లో ఆదివారం స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఈ అవతారం గురించి వివరించారు.

### ఘనంగా సేవా సమితి వార్షికోత్సవం


రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కొమ్మాది: భీమిలిలోని సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, అష్టోత్తర శత నామావళి, రుద్రాభిషేకం జరగ్గా, పెద్ద సంఖ్యలో భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### జ్యోతిష్య శాస్త్రంపై జాతీయ సదస్సు

కొమ్మాది: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలాజికల్ సైన్సెస్ (ఐసీఏఎస్) ఆధ్వర్యంలో రుషికొండలో ఓ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఐసీఏఎస్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు నవనీత్ కౌశిక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశంగించారు. ఆరోగ్యం మహాభాగ్యం, ఆధ్యాత్మికత, సనాతన ధర్మం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యంపై ఆయన ప్రసంగించారు.

### నృత్య కళాకారులకు ప్రశంసాపత్రాల అందజేత


నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. రాయల్ డ్యాన్స్ అకాడమీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో గణపతి స్తుతితో కార్యక్రమం ప్రారంభం అయింది. వినాయక కౌతమం, కృష్ణం కలయాసఖీ, జతిస్వరం, అష్టలక్ష్మీ వైభవం, శ్రీ రాఘవం తదితర కూచిపూడి నృత్యాంశాలకు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భగా స్థానిక పరిపాలన అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కళలను ప్రోత్సహించడానికి అందరూ సహకరించాలన్నారు. కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులు కావ్య, నివేదిక, జాహ్నవి, వినీల, రాజీ, దీక్షిత, మనవిత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు మందులు, సరకుల పంపిణీ


మందులు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి, నిరుపేదలకు గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మందులు, నిత్యావసర వస్తువులు ఆదివారం అందజేశారు. మధురవాడ, కొమ్మాది పరిసర ప్రాంతాల్లో కేన్సర్ ఇతర వ్యాధులతో బాధ పడుతున్న పేదలు 50 మందికి వీటిని సంస్థ నిర్వాహకులు పోతల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మరింత బాధ్యతతో పని చేయాలి

వార్డు అధ్యక్షులకు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చిన్న శ్రీను సూచన


వార్డు అధ్యక్షులను అభినందిస్తున్న చిన్న శ్రీను


చిన్న శ్రీనుని సత్కరిస్తున్న మధురవాడ 5, 6, 7, 8 వార్డుల నాయకులు

మధురవాడ: ప్రజా సమస్యలపై మరింత బాధ్యతతో పని చేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని 5, 6, 7, 8 వార్డుల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి ఆదివారం ఆయనను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, వారి సంక్షేమమే పార్టీకి ముఖ్యమని, వారి బాగోగులపై మరింత దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత సమ్మె జయప్రదానికి పిలుపు


మాట్లాడుతున్న సిటు భీమిలి జోన్ అధ్యక్షుడు మూర్తి

తగరపువలస: కార్మిక సమస్యల పరిష్కారం కోసం జూలై 9న జరగనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిటు జిల్లా కార్యదర్శి మణి కోరారు. ఆదివారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో జరిగిన సిటు జోన్ మహాసభలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక చట్టాలను నిరీర్యం చేసి వారిని బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. భీమిలి జోన్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పలు ప్రభుత్వ స్కీమ్‌లకు చెందిన కార్మికులు వేతన దోపిడీకి గురవుతున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం భీమిలి జోన్‌కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఆర్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శిగా ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా ఊళ్ల నాగరాజు, సీతాదేవి, సహాయ కార్యదర్శులుగా నీలాతి రాము, రవ్వ నరసింగరావు, సన్యాసి పైడమ్మ, పార్వతి, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ, కె.వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులుగా గురప్ప, ఎర్నిబాబు, రాజేష్‌లను ఎన్నుకున్నారు.

## 21 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు రాయపాలెంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్–భీమిలి అధికారులు ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు వెంకటరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వేములవలస పాత బ్రిడ్జి వద్ద..**

ఆనందపురం మండలం వేములవలస పాత బ్రిడ్జి వద్ద సత్యపాన్ షాపు నుంచి ఆదివారం స్థానిక పోలీసులు 9 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సీహెచ్ వాసునాయుడు తెలిపారు.

## ఆకట్టుకున్న శ్రీకృష్ణ లీలలు నృత్యరూపకం


శ్రీకృష్ణ లీలలు ప్రదర్శిస్తున్న శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయ బృందం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ లీలలపై నృత్యరూపకం ప్రదర్శించారు. శ్రీకృష్ణ అర్పణం భక్తి వేడుక కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన శ్రీకృష్ణ కూచిపూడి నృత్యనిలయ కళాకారులు ఈ ప్రదర్శన ఇచ్చారు. కృష్ణవేణి ఈశ్వరి దర్శకత్వంలో కళాకారులు ఎస్.జ్యోతి మృదుల, కె.మానసశ్రీ, ఆర్.మధురిమ నారాయణ, ప్రతిభా ప్రయాగ, నికిత సుమశ్రీ, జై సాయి శ్రావణి, లహరి కృష్ణవేణి, రిషిక, లక్ష్మి అక్షిత తమ గానం, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస మాట్లాడుతూ భక్తిలో పాతుకుపోయిన సాంస్కృతిక వ్యక్తీకరణ ద్వారా భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 95425 11108 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

## ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ అంటూ సాగర్ నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం రామకృష్ణుల నామాలు మార్మోగాయి. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, పలు ప్రవచనాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో ఉద్యోగ విరమణ చేసిన కొందరు కార్మికులు అయిదేళ్లుగా పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని చిట్టివలస జ్యూట్‌మిల్స్ పెన్షన్ల సంఘం అండ్ విశ్రాంత పెన్షనర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పీఎఫ్ కార్యాలయం నుంచి 10డి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించి 6 నెలలు గడచినా ముందుకు సాగలేదన్నారు. యాజమాన్యం పెన్షనర్లు అందరినీ కలుపుకుని న్యాయం జరిగేలా చూడాలని ఇటీవల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు యాజమాన్యాన్ని ఆదేశించారన్నారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల వివరాలు ఆన్‌లైన్ ద్వారా సులభం అవుతాయని పీఎఫ్ కమిషనర్ అవినాష్ కుమార్ తెలియచేశారన్నారు. వీటన్నిటిని పరిష్కరించడానికి పీఎఫ్ కార్యాలయం నుంచి ఇద్దరు ఉద్యోగుల్ని పంపించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెన్షనర్ల సంఘం నుంచి మోర అప్పలరాజు, దామోదర బాబాజీ, సింగిడి అప్పారావు మిల్లు యజమాని కె.కె. బజోరియాను కలిసి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించామన్నారు.

## మారికవలసలో బిచ్చగాడు మృతి



మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం ఆర్‌జీకే కాలనీ మార్కెట్ ఖాళీ షెడ్ల వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని బిచ్చగాడి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. వారి సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సుమారు 70–80 ఏళ్ల వయసున్న వృద్ధుడు గత కొంత కాలంగా మారికవలస పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదని, సమాచారం తెలిసిన వారు తమని సంప్రందించాలని పీఎంపాలెం ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేస్తున్నామని అన్నారు.

## లారీ టైరు పేలి వ్యాపించిన మంటలు

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం జాతీయ రహదారిపై ఆదివారం వేకువ జామున పెందుర్తి వెళ్లే మార్గంలో తారస్ టైరు పేలి మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశాడు. రోడ్డు మొబైల్ వాహన సిబ్బంది, సబ్బవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

## సమాజంలో గురువుల పాత్ర కీలకం


ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు తదితరులు

పద్మనాభం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ అన్నారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి పదవీ విరమణ చేసిన ముదరగడ్డ సన్యాసిరావు, ఉపాధ్యాయుడు పత్రి అప్పారావు దంపతులకు ఆదివారం పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలో ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతంగా పని చేసే ఉపాధ్యాయుల సేవలను ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని అన్నారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులే అన్నారు. డీఈవో, మాజీ ఎమ్మెల్సీతో పాటు పలువురు వక్తలు సన్యాసిరావు, అప్పారావు సేవలను కొనియాడారు. సన్యాసిరావు, అప్పారావు దంపతులను జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేర్వేరుగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంఈవోలు ఎస్‌డీ బాబూలాల్, సీహెచ్ రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, బుగత సత్యనారాయరణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఇమంది పైడిరాజు, అవనాపు అరుణ్ కుమార్, రెడ్డిపల్లి జగదీష్ బాబు, ఎం.శ్రీనివాస్, సంగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో షూటింగ్ సందడి


షూటింగ్ జరుగుతున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని రెండు చోట్ల ఆదివారం సినిమా షూటింగ్ జరిగింది. పద్మనాభం జంక్షన్, కురపల్లి క్వారీలో షూటింగ్ చేశారు. గంజాయి అమ్మడాన్ని హీరో రోహన్ పట్టించాడన్న నెపంతో ఇతన్ని హతమార్చేటువంటి సన్నివేశాలు చిత్రీకరించారు. అనగాదేవి మూవీస్‌లో ప్యాన్ ఇండియా సినిమా షూటింగ్‌లో ఆఖరి సన్నివేశాలు చిత్రీకరించారు. నిర్మాతగా ఆర్ఎస్ సత్యనారాయణరాజు వ్యవహరిస్తున్నారు.

## తప్పుడు వీలునామాలతో భూముల విక్రయం


వివరాలు తెలియజేస్తున్న సత్యవర ప్రసాద్ రెడ్డి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలసలో సర్వే నంబర్ 73, 74, 75/1లో సుమారు 43 ఎకరాలలో ఉన్న మోటమర్రి చిన సన్యాసిశెట్టికి చెందిన భూములను పూర్తిగా హక్కులు లేని వ్యక్తులు 2008 నుంచి తప్పుడు వీలునామాలతో విక్రయించారని జీరు సత్యవర ప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన చిట్టివలసలో పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు తెలియచేశారు. ఈ భూములకు నిజమైన వారసులుగా ఉన్న పూసర్ల చిట్టిబాబు, సుబ్బారావు, చిన్న సుబ్బారావు వెంకట రంగనాథ గుప్త, వెంకట అప్పారావు, నారాయణరావు, తమ్మన్నశెట్టి అనే వ్యక్తులు తమకు హక్కులుగా ఉన్న ఈ భూములపై తనను జీపీఏ హోల్డర్‌గా నియమించారన్నారు. ఈ భూములపై యాజమాన్య హక్కుల కోసం ఇప్పటి వరకు జిల్లా, హైకోర్టులను ఆశ్రయించామన్నారు. ఈ భూముల్లో అభివృద్ధి పనులు జరగకుండా హక్కుదారులైన పూసర్ల కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులు, ఎల్‌పీలు ఇవ్వకుండా జీవీఎంసీ కమిషనర్‌కు తమ న్యాయవాది ద్వారా పలు ఫిర్యాదులు చేశారన్నారు. అయినప్పటికీ యథేచ్ఛగా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సర్వే నంబర్లలో గల భూములను ఎవరు కొనుగోలు చేసినా, అక్రమ లే అవుట్లు పొందడానికి ప్రయత్నించినా చెల్లవన్నారు. తమ హక్కులను కాపాడుకోవడానికి పూసర్ల కుటుంబ సభ్యులే న్యాయపరమైన సాక్ష్యాలతో వచ్చి తప్పుడు వీలునామాలతో భూములు విక్రయించిన వారిపైనా, కొనుగోలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటారన్నారు.

## బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల నిరీక్షణ


10 వారాల ఉపాధి హామీ వేతనం రావాలంటున్న పందలపాక కూలీలు

తగరపువలస: తమకు ప్రభుత్వం నుంచి 10 వారాల ఉపాధి హామీ కూలి డబ్బులు రావలసి ఉందని ఆనందపురం మండలం పందలపాక పంచాయతీకి చెందిన బీసీ కాలనీ వాసులు వాపోయారు. పంచాయతీలో ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన 150 నుంచి 200 కుటుంబాల వారు గ్రామీణ ఉపాధి హామీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికి వంద రోజులుగా సుమారు 14 వారాలు పనికి వెళ్తే కేవలం 4 వారాలకు సంబంధించిన కూలి డబ్బులు మాత్రమే ఇచ్చారన్నారు. 10 వారాల పాటు ఒక్కొక్కరికి పనిని బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేలు రావలసి ఉందన్నారు. ఇన్నేసి వారాల పాటు డబ్బులు లేకుండా ఆకలి మంటలతో పనులకు వెళ్లలేమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోతే ప్రత్యామ్నాయ పనులు చూసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఎలాంటి వసతులు లేకుండా కాలనీలో నివసిస్తున్నామని, కనీసం ఉండటానికి సరైన గూడు కూడా లేదని కాలనీవాసులు వాపోయారు.

## ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టపై శనివారం రాత్రి పార్కింగ్ చేసిన ఏపీ 39 ఓయూ 3489 నంబరు గల యమహా ఎంటీ–15 ద్విచక్ర వాహనం చోరీకి గురయింది. పల్లె సందీప్‌కుమార్‌కు చెందిన వాహనం పెట్రోల్ అయిపోవడంతో ఇంటి ముందు నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం చూసే సరికి ద్విచక్రవాహనం మాయం కావడంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.